సాక్షి
గుంటూరు
శనివారం । 26 । జూలై । 2025



ప్రత్యేక అలంకరణలో మహా సరస్వతి

పిడుగురాళ్ల: నాగుల గుడిలోని మహాసరస్వతి అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోవాడలో శ్రావణ పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పార్వతి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం:స్థానిక అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. ముఖ మండపంలోని శ్రీ చక్రానికి కుంకుమతో అర్చనలు జరిగాయి.

న్యూస్‌రీల్

అమ్మ వారికి శ్రావణ శుక్రవారం పూజలు



దుగ్గిరాల: మండలంలోని పలు గ్రామాలలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం తొలి శుక్రవారం పూజలు నిర్వహించారు. పెదకొండూరులోని కనకపుట్టలమ్మ తల్లిని, కంఠంరాజు కొండూరులో మహంకాళి అమ్మవారిని భక్తులు దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు, వ్రతాలు చేశారు. అనంతరం ఆలయంలో అన్న సంతర్పణ జరిగింది

నూతన గ్రీవెన్స్‌సెల్ భవనానికి భూమి పూజ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో కొత్త గ్రీవెన్స్ సెల్, మీడియా గ్యాలరీ భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, విటి-ఏపీ విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్రలు భూమి పూజ చేశారు. పోలీస్ శాఖ ద్వారా ప్రజా ఇంటర్ ఫేస్, మీడియా సంబంధాన్ని పెంపొందించే దిశగా ముఖ్యమైన అడుగు పడిందని అన్నారు. గ్రీవెన్స్ సెల్, మీడియా గ్యాలరీ నిర్మాణానికి సహకరిస్తున్న వీటి- ఏపీ విశ్వవిద్యాలయాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ ఈ నిర్మాణాలకు చొరవ చూపిన విశ్వవిద్యాలయ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.వి.సెల్వంకు కృతజ్ఞతలు తెలిపారు.

సజావుగా వర్సిటీలో యోగా పరీక్షలు



పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఎమ్మెస్సీ యోగా ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన నాలుగవ సెమిస్టర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని వర్సిటీ పీజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య మన్నవ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి హాల్ టికెట్లు పరిశీలించి, పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారమే పరీక్షలు జరుగుతున్నాయన్నారు.

579.00 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 579.00 అడుగులకు చేరింది. ఇది 280.1200 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 511, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,20,635 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన డ్రోన్



చీరాల: చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో శుక్రవారం ముగ్గురు యువకులు అలల తాకిడికి కొట్టుకుపోగా రూరల్ ఎస్సై చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను అప్రమత్తం చేసి ప్రాణాలు కాపాడారు. మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో అంకాలమ్మ తల్లి కొలుపుల సందర్భంగా గ్రామానికి చెందిన వెయ్యి మంది సముద్ర స్నానాలు చేసేందుకు వచ్చారు. వారిలో ముగ్గురు యువకులు ఎక్కువ లోతుకు వెళ్లి కొట్టుకుపోగా డ్రోన్‌తో గుర్తించిన కాపాడారు.

ఎన్నాళ్లీ ఎదురు చూపులు?

కూటమి పాలనలో పెట్టుబడి సాయం అందక రైతులకు కష్టాలు

- విడుదల కాని అన్నదాత సుఖీభవ నిధులు
- ఈ-కేవైసీ పూర్తయినా స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- మరోవైపు ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు
- పెట్టుబడి డబ్బు కోసం అన్నదాతలకు తప్పని అవస్థలు
- విత్తనాలు, ఎరువుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి

కర్షకులకు ఏటా రూ.20 వేలు సాయం చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు పదే పదే ప్రసంగాల్లో చెప్పారు. అధికారంలోకి వచ్చాక యథాప్రకారం మాట మార్చేశారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద ఒక్క పైసా కూడా విదల్చలేదు. ఏడాది గడిచినా.. ఈ-కేవైసీ పూర్తి చేసినా.. చంద్రబాబు మనసు మాత్రం కరగడం లేదు. మోసాల కూటమి పాలనతో అప్పుల పాలవుతున్న అన్నదాతలు సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు.



కొరిటెపాడు (గుంటూరు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కో ఈ మేరకు వీలు దొరికినప్పుడల్లా హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కూడా దాటింది. గత ఖరీఫ్, రబీ సీజన్లూ ముగిసిపోయాయి. ఒక్క పైసా కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఇవ్వలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో వారికి పెట్టుబడి ఎంతో అవసరం. అయినప్పటికీ ప్రభుత్వం పైసా విదిల్చిన పాపాన పోలేదు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు..

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనుల్లో రైతులు ఉన్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మినుము, పసుపు, మిరప, కూరగాయలు తదితర పంటల సాగు ఊపందుకుంటోంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.15 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనాలు రూపొందించింది. వీటన్నింటికీ పెట్టుబడి అవసరం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదలపై కనీసం స్పష్టత కూడా ఇవ్వడం లేదు. దీంతో అప్పులు చేయాల్సిన దుస్థితిలోకి రైతులు కూరుకుపోతున్నారు.

ఈ-కేవైసీ ప్రక్రియ ముగిసినా..

అన్నదాత సుఖీభవ నిధుల విడుదల చేయాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,09,343 మంది రైతులుండగా, ఇప్పటికే 1,05,125 మందికి ఈ-కేవైసీ పూర్తయింది. 3,656 మందికి సంబంధించిన మాత్రమే పెండింగ్‌లో ఉంది. మరో 562 మందిని వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ ప్రక్రియ దాదాపు పూర్తయినప్పటికీ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట రకం	సాగు విస్తీర్ణం అంచనా (హెక్టార్లలో)
వరి	62,000
పత్తి	24,000
మిరప	16,752
మినుము	3,122
కూరగాయలు	1,947
పసుపు	4,000
పండ్ల తోటలు	3,590
మొత్తం	1,15,411



బుడంపాడు గ్రామంలో పత్తి విత్తుకునేందుకు సిద్ధం చేసిన పొలం

వైఎస్సార్ సీపీ హయాంలో ఠంచనుగా..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించింది. ఈ పథకం కింద జిల్లాలోని 1,23,885 మంది రైతులకు రూ.820 కోట్ల మేర పెట్టుబడి సాయంగా ఇచ్చింది. దీంతోపాటు ఉచిత పంటల బీమా కోసం రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద 79,469 మంది రైతులకు రూ.68.47 కోట్లు అందజేసింది.

మాట నిలబెట్టుకోవాలి



అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూస్తున్నాం. గత ఏడాది ఇవ్వలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై కూడా రెండు నెలలు కావస్తోంది. ఇకనైనా సాయం చేస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుంది.

– తియ్యగూర పేరిరెడ్డి, రైతు, గారపాడు, వట్టిచెరుకూరు మండలం.

రెండేళ్ల విడతల సాయం అందించాలి



గతేడాది అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వలేదు. రైతులు ఇబ్బంది పడ్డారు. వాటికి ఇప్పటివి కూడా కలిపి ఇచ్చి ఆదుకోవాలి. కౌలు రైతులకూ పథకం వర్తింపజేయాలి.

– కంచుమాటి అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ డెస్క్ విధానాన్ని అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్న గోల్డ్, హ్యాండ్లూమ్ క్లస్టర్ పనులు మరింత వేగంగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు రూరల్ మండలంలో ఏర్పాటు చేయనున్న ప్లాస్టిక్ క్లస్టర్, తాడికొండలో ఏర్పాటు చేయనున్న మాడ్యూలర్ కిచెన్ ప్రొడక్ట్ క్లస్టర్, దుగ్గిరాలలో డెర్మరిక్, గుంటూరు, తెనాలిలలో సిల్వర్, ప్రింటింగ్ క్లస్టర్స్ ప్రతిపాదనలు వెంటనే పూర్తి చేయాలన్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని పరిశ్రమల ఏర్పాటుకు అందించిన దరఖాస్తుల్లో ఏపీ క్యాపిటల్ సిటీ జోన్‌కు నోటిఫై చేసి సర్వే నంబరు పరిశీలించిన తరువాత అనుమతులకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను సంబంధించి తిరస్కరణకు గురైన క్లయిములను పరిశ్రమల యాజమాన్యాలతో మరోసారి మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి సంబంధించి పది క్లయిములకుగాను రూ. 99 లక్షలు మంజూరు చేస్తూ సమావేశం తీర్మానం చేసిందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కె.విజయలక్ష్మి, కమర్షియల్ ట్యాక్స్ డీసీ మనోరమ, అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

విజయ స్ఫూర్తి... చెరగని కీర్తి

- కార్గిల్ యుద్ధంలో తెనాలి ప్రాంత వాసులు ముగ్గురు వీరమరణం
- నేడు కార్గిల్ విజయ దివస్ సందర్భంగా వారి సేవలు స్మరణీయం



ఎస్కే మస్తాన్‌వలి



ఎండీ హాజీబాషా



కేసన శివయ్య

తెనాలి: పాక్‌తో 1999లో కార్గిల్ యుద్ధం అనివార్యమైంది. భారతీయ సేనలు మూడునెలలు భీకర పోరాటం చేసి విజయం సాధించాయి. ఆ యుద్ధంలో ఉమ్మడి తెనాలి డివిజన్ సైనికులు ముగ్గురు వీరమరణం పొందారు. వారి స్ఫూర్తి నేటికీ కొనసాగుతోంది. కార్గిల్ యుద్ధంలో మాతృభూమి రక్షణకు ప్రాణం అర్పించడమే లక్ష్యంగా భారత సైనికులు దూసుకెళ్లారు. శత్రువుకు అవకాశం ఇవ్వకుండా తరిమికొట్టారు. యుద్ధ విజయంలో భారతీయ ఇన్‌ఫాంట్రీ విభాగం సైనికులే నిజమైన హీరోలయ్యారు. నాడు వీరమరణం పొందిన సైనికుల్లో తెనాలి డివిజన్‌కు చెందిన ఎస్కే మస్తాన్‌వలి, ఎండీ హాజీబాషా, కేసన శివయ్య ఉన్నారు. నేడు కార్గిల్ దివస్ సందర్భంగా వారిపై ప్రత్యేక కథనం ఇది.

రక్తం చిందించిన మస్తాన్‌వలి...

ఎస్కే మస్తాన్‌వలి స్వస్థలం నిజాంపట్నం. అప్పటికి ఆయన వయస్సు 25 ఏళ్లు. పేద కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచి సైనికుడు కావాలన్నదే లక్ష్యం. 1994లో ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికయ్యారు. సైనికుడిగా విధులు నిర్వర్తిస్తూ కార్గిల్ యుద్ధంలో కదం తొక్కారు. మాతృభూమి కోసం అమరడయ్యారు. మస్తాన్‌వలి భౌతికకాయానికి నాడు అధికారిక లాంఛనాలతో జరిగిన అంత్యక్రియలకు నిజాంపట్నంలో జనం పోటెత్తారు. గ్రామస్తులతోపాటు ఎందరో పుష్పాంజలి ఘటించారు. ఆయన గుర్తుగా స్మారకస్తూపాన్ని నిర్మించారు. ఆయన తండ్రి బాక్సి నిజాంపట్నంలోని మస్తాన్‌వలి సమాధి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. మస్తాన్‌వలి పేరుతో ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు.

శివయ్య త్యాగం చిరస్మరణీయం

చేబ్రోలు మండల గ్రామం శేకూరులో వ్యవసాయ కూలి దంపతులు సాంబయ్య, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమారుడు కేసన శివయ్య. గ్రామం నుంచి పలువురు సైన్యంలో చేరటంతో వారి స్ఫూర్తితో తానూ సైనికుడు కావాలని శివయ్య భావించారు. పదో తరగతితోనే చదువు ఆపేశారు. 1989-90లో ఆర్మీకి ఎంపికయ్యారు. రైఫిల్స్ విభాగంలో పనిచేస్తూ కార్గిల్ యుద్ధంలో పాలుపంచుకున్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన తమ కుమారుడు స్ఫూర్తిగా నిలవాలనే భావనతో ఆయన విగ్రహాన్ని శేకూరులో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని చూసినపుడల్లా శివయ్య త్యాగం తమకు స్ఫూర్తిగా నిలుస్తుందని గ్రామస్తులు చెప్పారు.



శేకూరులో కేసన శివయ్య విగ్రహం



నిజాంపట్నంలో నిర్మించిన ఎస్కే మస్తాన్‌వలి స్మారక చిహ్నం

పెద్దల బాటలో సాగిన హాజీబాషా

చందోలు గ్రామంలో 1973లో అబ్దుల్ రెహ్మాన్, ముంతాజ్‌బేగం దంపతులకు జన్మించారు హాజీబాషా. హాజీబాషా తండ్రి రెహ్మాన్, తాత షేక్ మస్తాన్‌లు కూడా సైన్యంలో పనిచేసిన వారే. తమ పెద్దల స్ఫూర్తితో 20 ఏళ్ల వయసులోనే అంటే 1993లో సైన్యంలో చేరారు. 110 ఇంజినీర్ రెజిమెంట్ ముంబయి ఇంజినీరింగ్ గ్రూపులో 17వ బెటాలియన్ గార్వాల్ రైఫిల్స్‌లో పనిచేశారు. 'ఆపరేషన్ విజయ్'లో వీరమరణం పొందారు. కుమారుడి మరణంతో ఆయన తండ్రి రెహ్మాన్ దిగులుపడి తర్వాతి ఏడాదిలోనే కన్నుమూశారు. హాజీబాషా తమ్ముడు కూడా ఎనిమిదేళ్ల వయసులో మెదడువాపుతో చనిపోయారు.

జల్సాలకు అలవాటై బైకులు చోరీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

- ఇద్దరు మైనర్లు సహా తొమ్మిది మంది నిందితులు అరెస్ట్
- రూ.25 లక్షల ఖరీదైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- కొనుగోలు చేసిన వారిని కూడా అరెస్టు చేస్తామని వెల్లడి

నగరంపాలెం: జల్సాలు చేయడానికి సొమ్ము కోసం ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న తొమ్మిది మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. సుమారు రూ.25 లక్షల విలువైన 34 బైకులను వారి నుంచి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల గుంటూరు తూర్పు, పశ్చిమ సబ్ డివిజన్లలోని పట్టాభిపురం, పాత గుంటూరు, నగరంపాలెం, తాడికొండ పీఎస్‌ల పరిధిలో ఎక్కువగా బైకు చోరీలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, పాత నేరస్తుల కదలికలు, సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించామని చెప్పారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేశామని అన్నారు. ఈ కేసులో ఇద్దరు మైనర్లు (కేవీపీ కాలనీ 4వ వీధి, శ్రీనివాసరావు పేట వాసులు)తోపాటు అక్కిశెట్టి ఆకాష్ (ఎల్‌ఐసీ కాలనీ ఒకటో వీధి), ఉప్పు రాకేష్ (స్తంభాలగరువు మూడో వీధి), మడుగుల రవితేజ (కేవీపీ కాలనీ ఒకటో వీధి), షేక్ ఆషీరు (పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామం), కోన వెంకటగోపీ (లక్ష్మీనగర్ రెండో వీధి), టి.రాజేష్, బోయపాటి జయసాయి (తాడికొండ మండలం మోతడక గ్రామం ఎస్‌టీ కాలనీ)లను కూడా అరెస్ట్ చేశామని వివరించారు.

అందరూ 27 ఏళ్లలోపు వారే...

అరెస్ట్ అయిన వారందరూ 27 ఏళ్లలోపు వయస్సు వారే. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. రవితేజ, ఆకాష్‌లు చోరీలకు ఆజ్యం పోశారు. వీరంతా ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గుంటూరు నగర పరిధిలోని ఇళ్ల ఎదుట, మార్కెట్ ప్రదేశాలు, ఆసుపత్రులు, ప్రార్థన స్థలాల వద్ద నిలిపి ఉంచిన బైకులను దొంగిలించారు. మారుతాళాలు లేదా హ్యాండిల్ గట్టిగా పట్టుకుని తిప్పేయడం ద్వారా చోరీలు చేస్తున్నట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. తర్వాత ఆ బైక్‌లను విక్రయించి సొమ్ము చేసుకునేవారు. జల్సాలకు బానిసలుగా మారి ఈ దొంగతనాలు చేశారని పేర్కొన్నారు. వీరిలో ఒకరిద్దరు పాత నేరస్తులు ఉన్నారు. బైకులను కొనుగోలు చేసిన వారిని కూడా అరెస్ట్ చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. చోదకుల నిర్లక్ష్యం వల్లే వాహన చోరీలు జరుగుతున్నాయని అన్నారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. వాహనాలకు హ్యాండిల్ లాక్, వీల్ లాక్‌లను బిగించుకోవాలని చోదకులకు సూచించారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), అబ్దుల్ అజీజ్ (తూర్పు), అరవింద్ (పశ్చిమ), సీఐలు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఇంద్రకీలాద్రికి శ్రావణ శోభ



ప్రత్యేక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

- శ్రావణ మాసం తొలి శుక్రవారంతో భక్తుల రద్దీ
- ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కుంకుమార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణ మాసం తొలి శుక్రవారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు అన్ని మార్గాలను పూలతో అలంకరించారు. అమ్మవారికి నిర్వహించిన పలు అర్జిత సేవలు, ప్రత్యేక కుంకుమార్చనలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చనలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద శ్రావణ మాస ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక కుంకుమార్చన జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ప్రతి గంటకు ఒక బ్యాచ్ చొప్పున పూజ నిర్వహిస్తామని చెప్పారు. అమ్మవారి పాత మెట్ల మార్గంలో మెట్ల పూజలను భక్తులు విశేషంగా నిర్వహించారు. కొందరు భక్తులు మోకాళ్లపై మెట్లు ఎక్కుతూ, అమ్మవారి ఆలయ మెట్లుకు పసుపు, కుంకుమ పెట్టి పూజలు నిర్వహించారు. గత రెండు రోజులుగా దుర్గగుడి ఘాట్‌రోడ్డును మూసివేసిన ఆలయ అధికారులు, శుక్రవారం ద్విచక్ర వాహనాలను అనుమతించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

- చేబ్రోలులో 22.6 మి.మీ. వర్షం
- సగటున 12.4 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 22.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా ప్రత్తిపాడు మండలంలో 5.4 మి.మీ వర్షం పడింది. సగటున 12.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 18.4 మి.మీ., తెనాలి 17.2, పెదనందిపాడు 14.8, కొల్లిపర 14.6, గుంటూరు తూర్పు 14.4, కాకుమాను 13.2, దుగ్గిరాల 12.8, తుళ్ళూరు 12.4, పొన్నూరు 11.6, మేడికొండూరు 10.4, పెదకాకాని 10.2, తాడేపల్లి 9.8, మంగళగిరి 9.4, ఫిరంగిపురం 9.2, తాడికొండ 8.6, వట్టిచెరుకూరు మండలంలో 8.4 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై 25వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 133 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 211.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

అన్ని వర్గాలకు అందుబాటులో దూరవిద్య



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే వైవిధ్యమైన దూరవిద్య కోర్సులను ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తోందని ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఎన్జీవో కాలనీలోని మహాత్మాగాంధీ కళాశాలలో ఇగ్నో కోర్సులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శరత్‌చంద్ర మాట్లాడుతూ దేశంలో అత్యధిక మంది విద్యార్థులు, అనేక కోర్సులతో విద్యను అభ్యసిస్తున్న ఉన్నతమైన విశ్వ విద్యాలయంగా ఇగ్నో గుర్తింపు పొందినట్లు చెప్పారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రంగా మన రాష్ట్రంలోని 15 జిల్లాలకు ఇగ్నో సేవలు అందిస్తోందని, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సివిల్స్ స్థాయికి తగిన పాఠ్య ప్రణాళికతో కూడిన అంశాలు ఇగ్నో ప్రత్యేకతలు అని, ఒకే విద్యా సంవత్సరంలో ఒక రెగ్యులర్ కోర్సుతో పాటు దూరవిద్యా విధానంలో ఆన్‌లైన్‌లో మరొక కోర్సు అభ్యసించే వీలుందని తెలిపారు. కార్యక్రమంలో గౌతమి విద్యాసంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ పి. ఉదయ్‌కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఎం నాయక్ సస్పెన్షన్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరపాలక సంస్థ మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)గా పని చేస్తున్న నాయక్, మెప్మాలో పనిచేస్తున్న ఓ రిసోర్స్ పర్సన్(ఆర్పీ) అశ్లీల చిత్రాన్ని సీఓ, సీఎంఎంల వాట్సాప్ గ్రూప్‌లో గత కొద్ది రోజుల కిందట పోస్ట్ చేసి డిలీట్ చేశాడు. ఈ లోపు చాలా మంది ఆ చిత్రాన్ని చూసి, మెప్మా ఎండీ తేజ్‌భరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సీఎంఎంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసి, చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ విజయలక్ష్మిని ఆదేశించారు. సీఎంఎం నాయక్‌ను సస్పెండ్ చేశామని పీడీ 'సాక్షి'కి తెలియజేశారు.

7న జిల్లా స్థాయి జావెలిన్ త్రో పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7వ తేదీన అండర్-14, 16, 18, 20, 23, బాలబాలికలు, సీనియర్ పురుషులు, మహిళల జిల్లా స్థాయి జావెలిన్‌త్రో పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు స్టేడియంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



మాదకద్రవ్యాల వినియోగం ఆందోళనకరం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: యువత మాదకద్రవ్యాలకు బానిసలవడం ఆందోళనకరమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జిల్లా స్థాయి మాదకద్రవ్యాల సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం డీఆర్సీ సమావేశ మందిరంలో ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, అధికారులతో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొందరు తమ స్వార్థం కోసం విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు, జూనియర్, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాటి వివరాలు సంబంధిత పోలీస్‌స్టేషన్, తహసీల్దారులకు అందించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం ఉంటే తమ దగ్గర్లో పోలీసులకు తెలియజేయాలన్నారు. జీజీహెచ్‌లో రీ హ్యాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు వైద్యులు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనర్థాలపై ప్రత్యేక పోస్టర్లు, ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబరు వివరాలను విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఇతర ముఖ్య ప్రాంతాల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. శివారు ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న భవనాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహనతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ నుంచి మాదకద్రవ్యాలకు సంబంధించి 15 కేసులు నమోదు చేసి, 42 మందిని అరెస్టు చేశామని వివరించారు. ఐదు వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. రిపీటెడ్‌గా మాదకద్రవ్యాలు విక్రయించే వారిని 96 మందిని గుర్తించామన్నారు. నలుగురిపై పీడీ యాక్ట్, 15 మందిపై పీఐడీఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమం ద్వారా 108 విద్యా సంస్థల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఎవరైనా తప్పుడు మార్గాల్లో వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్పీ కోరారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డీఈఈ రేణుక, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు వెస్ట్: విలువైన ప్రాణాన్ని నిర్లక్ష్యంతో పోగొట్టుకోకూడదని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, అధికారులతో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఐ-ఆర్ఏడీ యాప్‌లో రవాణా, పోలీసు, రహదారులు, వైద్య శాఖల వారు ప్రమాదాల వివరాలు, తనిఖీలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అధికారులు గుర్తించిన 52 బ్లాక్ స్పాట్‌లు వద్ద తక్షణం తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని సిగ్నల్ లైట్ల వద్ద జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారి సమీపంలో ఉండే ట్రామా కేర్ ఆసుపత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స అందించేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల పి.డి. పార్వతీశం, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 206

కొమ్ములు : 89 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,200	9,700

(ధర రూ॥ల్లో)

కాయలు : 117 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,200	10,000

మొత్తం అమ్మకాలు : 154.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,400 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	34,695
అమ్మకాలు	38,350
నిల్వ	4,416

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,400
341	10,000-13,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,500
341	10,000-13,600
4884	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,400
దేవనూరు డీలక్స్	10,000-12,600
తాలు	5,300 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

కౌలు అర్జీలు పరిష్కరించేందుకు కృషి

– జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ



తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలు, వార్షిక కౌలు అర్జీలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని గ్రీవెన్స్ రీడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ అధికారి పి.జయశ్రీ అన్నారు. తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఇటీవల రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయిన 11వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించిన సమస్యల గురించి పలువురు తమ అర్జీలను పి.జయశ్రీకి అందజేశారు. సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. జమ కాని వారికి రానున్న 15 రోజులలో జమయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీలను రైతులు ఇచ్చి, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 54 ఫిర్యాదులు వచ్చాయి. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు బి. సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి. పద్మావతి, జి. రవీందర్, జి. భీమారావు, ఏజీ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగారావు రామకృష్ణన్, సామాజిక సంక్షేమ విభాగ అధికారి శ్రీనివాసరావు, డెవలప్‌మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్. మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

గుంటూరు లీగల్: మహిళపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.57 వేల జరిమానా విధిస్తూ ఐదవ అదనపు జిల్లా సెషన్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం.. తాడేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని సీతానగరం కరకట్ట వద్ద జరిగిన గ్యాంగ్ రేప్ కేసులో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2021 జూన్ 19న కేసు నమోదు చేశారు. ముగ్గుర్ని నిందితులుగా పరిగణించారు. వారిలో రామలింగం ప్రసన్నరెడ్డి అలియాస్ వెంకట్ పరారీలో ఉన్నాడు. మరో నిందితుడు షేక్ హబీబ్ అలియాస్ హనిగుండు మృతి చెందాడు. ఇంకో నిందితుడు సిరు కృష్ణకిషోర్ అలియాస్ కృష్ణను దోషిగా కోర్టు పేర్కొంది. విచారణ అనంతరం అతడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.57 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నీలిమ తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ బాధితురాలి తరఫున వాదనలు వినిపించారు. అప్పటి సీఐ శేషగిరిరావు కేసు దర్యాప్తు చేయగా, డీఎస్పీ జె.రాంబాబు చార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టు లైజన్ కానిస్టేబుల్ బి.శ్రీనునాయక్, అప్పటి తాడేపల్లి కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. మహిళకు న్యాయం జరిగేలా చూసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్ల ఎంపిక

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా స్థాయిలో జరగనున్న రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపిక ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు కుంచనపల్లిలోని గీతాంజలి స్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అమరావతిలో మంత్రి నారాయణ పర్యటన


నిర్మాణాల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

తాడికొండ: రాజధాని అమరావతిలో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను మంత్రి నారాయణ శుక్రవారం పరిశీలించారు. సీఆర్‌డీఏ ఇంజినీర్లతో కలిసి నేలపాడులోని నాన్ గెజిటెడ్ అధికారులు, గెజిటెడ్ అధికారులు, టైప్ -1, టైప్ -2, గ్రూప్ - డి ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు, అమరావతి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మూడేళ్లలో కచ్చితంగా రాజధాని పనులు పూర్తి చేసి తీరుతామన్నారు. నాన్ - గెజిటెడ్ ఆఫీసర్స్ కోసం మొత్తం 21 టవర్లలో 1,995 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని చెప్పారు. వీటిలో 9 టవర్ల నిర్మాణం పూర్తయిందని, మిగతావి డిసెంబర్ నెలాఖరుకు పూర్తవుతాయని పేర్కొన్నారు. గెజిటెడ్ ఆఫీసర్ల కోసం మొత్తం 14 టవర్లలో 1,140 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని.. 11 టవర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మరో 5 టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలు అమరావతిలో మెడికల్ కాలేజీలు నెలకొల్పుతున్నాయని వివరించారు. ముందుగా 50 చొప్పున పడకలతో రెండు హాస్పిటల్స్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. రెండు సీబీఎస్ఈ స్కూళ్లను కూడా ఈ సంస్థలు వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు తిరిగిచ్చిన ప్లాట్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

పీఎఫ్ రుణాలు సజావుగా ఇవ్వాలని వినతి


సీఈవోకు వినతి పత్రం సమర్పిస్తున్న నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ యాజమాన్యంలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాల మంజూరులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్‌లు ఆరోపించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో సీఈవో వి.జ్యోతిబసును ఆయన చాంబర్లో కలిసిన యూటీఎఫ్ ప్రతినిధులు బృందం దీనిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని పేర్కొన్నారు. తీరు మారని పక్షంలో జెడ్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేపడతామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ కారుణ్య నియామకాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న వారికి న్యాయం చేయాలని కోరారు. పీఎఫ్‌కు సమస్యలను వారంలో పరిష్కారమయ్యేలా చూస్తామని సీఈవో హామీ ఇచ్చారు. సీఈవోను కలిసిన వారిలో నాయకులు జి. వెంకటేశ్వర్లు, ఎం. గోవిందు, కె. కోటిరెడ్డి, కె. ప్రేమ్‌ఉమార్ ఉన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై సుబ్బారావు, క్లూస్ టీమ్

లక్ష్మీపురం: ఇంట్లో శుభకార్యం జరుగుతున్న నేపథ్యంలో దాచి పెట్టిన 92 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయిన ఘటన పై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గుంటూరు నగరంలోని కొరిటిపాడు హనుమయ్యనగర్ ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణేశ్వర అనే వ్యక్తి భవన నిర్మాణ పని చేస్తుంటారు. జూన్ నెలలో కుమారుడు వివాహం ఉన్నందున కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. జూన్ 21న ఇంట్లో బీరువాలో 92 గ్రాముల బంగారు ఆభరణాలు భద్రపరిచి, వివాహ పనుల్లో ఉండి పోయారు. అయితే శుభకార్యం అయిన తరువాత ఈ నెల 23వ తేదీన చూసే సరికి ఆభరణాలు కనిపించలేదు. దీంతో శుక్రవారం అరండల్‌పేట పోలీసులకు సమాచారం తెలియజేయగా ఎస్సై సుబ్బారావు, సిబ్బంది వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ADMISSIONS
- 10th పాస్ అయిన వారికి సువర్ణ అవకాశం. అగ్రికల్చర్ వెటర్నరీ, MPHW (F), MLT కోర్సులకు అడ్మిషన్ జరుగుచున్నవి. ఒకేషనల్ జూనియర్ కాలేజ్, గుంటూరు. 73867 06839

REAL ESTATE
LAND FOR SALE
- పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం మాచవరం గ్రామ పరిధిలో (హైవేకి దగ్గరలో) రోడ్ ఫేసింగ్ 2 ఎకరములు & 3 1/2 ఎకరములు అమ్మకం. సంప్ర: 90000 40400

TO-LET
- గుంటూరు బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్, కోస్టల్ బ్యాంక్ పైన 1వ ఫ్లోర్-2000sft ఆఫీసులకు/ కమర్షియల్ పర్పస్ కు మరియు బ్యాంకర్స్ కు రూమ్స్ అద్దెకు కలవు పెల్లర్ సౌకర్యం. 9849094439.

SERVICES
BUSINESS OFFER
- ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937

DOCUMENT MISSING
- ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి షేక్ బషీర్ W/o. షేక్ సనావుల్లా, సన్నద్‌నగర్, 3వలైను, సుద్దపల్లిడొంక పాత గుంటూరు. D.No.2462/2003 జిరాక్స్ కోసం ఇంటి నుండి స్టేడియంకు వస్తుండగా పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియపరచగలరు. 8522853477

GOLD FINANCE
- బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED
- గుంటూరులోని హాస్పిటల్ డిఫార్మసీ, బి ఫార్మసీ సర్టిఫికెట్ కలిగిన వారు & ఫార్మసిస్టు ANM, GNM నర్సింగ్ స్టాఫ్ కావలెను. 7997777108
- ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూప బడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444988/ 89
- మన రాజధానిలో ప్రముఖ కంపెనీ నందు పని చేయుటకు కనీసం ఒక సం॥ వర్క్ అనుభవం కలిగిన వారు కావలెను. సంప్ర॥ 9849054787
- నల్లపాడు, కైలాసగిరి వద్ద వైభవ్ ఇండస్ట్రీస్ వారి ప్యాకేజ్ & డ్రింకింగ్ వాటర్ బాటిల్స్ సప్లై చేయుటకు 2 వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9441812776, 7702747989
- Wanted Experienced Computer Accountant Should Know Hindi and English for Details Contact: 9160607468, 9441547482
- మంగళగిరి, తెనాలి ఏరియాల్లో పురుగు మందుల కంపెనీలో పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీ: 15000+3000, సం: 91214 69383
- తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 hrs. డ్యూటీ, జీతం : 12000, భోజనం సౌకర్యం. Q 10th,50సం.లోపు వారు.సంప్రతి 88014 97437
- స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 © 9963521122, 9963101122
- A1 పెస్ట్ కంట్రోల్ కొరకు 20 సం. వయసు గల 10th/ఇంటర్ P/F యువకులు కావలెను మంచి జీతం + రూమ్ + మీల్స్. వివరాలకు సంప్ర: 8464863989, 8317545701
- ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. పెదమండిపాడు విలేజ్, నర్సారావుపేట మండలం, గుంటూరు జిల్లా, 8 గంటలు డ్యూటీ. ఫోన్:90000 40439
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పొగాకు సక్రమంగా కొనుగోలు చేయాలి

ప్రభుత్వానికి రైతు సంఘాల నేతలు డిమాండ్



లక్ష్మీపురం: రాష్ట్రంలో పొగాకు కొనుగోలులో అవకతవకలు నివారించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను పెంచాలని, నాణ్యత పేరుతో తెచ్చిన పొగాకును బయ్యర్లు వెనక్కి పంపకుండా చూడాలన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పొగాకు రైతుల సంఘం నాయకుల సమావేశం డాక్టర్ కొల్లా రాజమోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలు పొగాకు కొనకపోవడంతో ఆందోళన చేపట్టడం వలన మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. కానీ గుంటూరు జిల్లాలో 50 కిలోమీటర్ల దూరం వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. సగం కూడా కొనుగోలు చేయకుండా బయ్యర్లు తిప్పి పంపుతున్నట్లు, ప్రైవేటు వారికి ఉపయోగపడేలా ఇలా చేస్తున్నట్లు ఆరోపించారు. దీంతో అయినకాడికి విక్రయించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 8 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఆందోళనలు, వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.హరిబాబు, కొల్లా రాజమోహన్, కంచుమాటి అజయ్, టి.రామారావు, జె.జయంతి బాబు, పి.శివాజి, పి.రామారావు, కె.గణేశ్ బాబు, పి.వి. జగన్నాథం, కె.విఠల్ రెడ్డి, బిక్కి శ్రీనివాసరావు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం గ్రామంలో ఓ యువకుడిపై తాడేపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. వడ్డేశ్వరం ప్రాంతంలో నివసించే యువకుడు (18) అదే ప్రాంతంలోని మైనర్‌ను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఆమె కుటుంబ సభ్యులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం కేసు నమోదు చేసి, సదరు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరస్పరం ఇద్దరూ ఇష్టపడ్డారని, కొంతమంది బలవంతం వల్లే బాలిక తరఫు వారు ఫిర్యాదు చేశారని యువకుడి తల్లిదండ్రులు చెబుతున్నారు. కేసు నమోదు చేశామని, సదరు యువకుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

27 నుంచి ఫ్లోర్ బాల్ పోటీల ఎంపికలు

వినుకొండ : ఈ నెల 27వ తేదీ నుంచి పల్నాడు జిల్లా ఫ్లోర్ బాల్ అండర్-14, అండర్-19 బాలబాలికల జిల్లా స్థాయి జట్ల ఎంపిక పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ మల్లవరపు బాబు తెలిపారు. అండర్ -14 వారు 2011 సెప్టెంబరు 7 లోపు, అండర్ -19 వారు 2006 సెప్టెంబరు 7 లోపు పుట్టి ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చేవారు తమ ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేదీ ధ్రువపత్రంతో రావాలని తెలిపారు. వివరాలకు 86399 22978ను సంప్రదించాలన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యాబోధన అవసరం


మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


ఉపాధ్యాయులతో కేఎస్ లక్ష్మణరావు, రామశేషాద్రిరావు, జనార్దన్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి కేంద్రంగా నైపుణ్యంతో కూడిన విద్యాబోధనను ఉపాధ్యాయులకు సాగించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్, టీచర్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో శుక్రవారం ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ హైస్కూల్లో ప్రైవేటు ఉపాధ్యాయులకు మనోవిజ్ఞాన నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాలను వివరించారు. తరగతి గదిలో విద్యార్థి కేంద్రీకృత విద్యా బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయుడే విద్యార్థికి లక్ష్య నిర్దేశకుడిగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విజయవాడలోని ఎడ్యుకేషనల్ టీచర్ రీసెర్చ్ కౌన్సెలింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రామశేషాద్రిరావు మాట్లాడుతూ కౌన్సెలింగ్ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక స్థితిని గమనించి విద్యాబోధన సాగించాలని సూచించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. జీకేఆర్ స్కూల్ డైరెక్టర్ జి.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల మానసిక స్థితిలో మార్పులను తీసుకురావడంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎల్‌టీఓ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, కార్యదర్శి ఎం.రాకేష్, కళాశాల విభాగ అధ్యక్షుడు కావూరి గోవిందరాజులు, జిల్లా, రాష్ట్ర స్థాయి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడులు చేస్తే అది సివిలైజేషనా?

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం
- డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు ఖండన
- పోలీస్‌స్టేషన్‌లో నేతల ఫిర్యాదు



తాడేపల్లి రూరల్ : 'మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ మాట్లాడుతుంటే.. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాత్రం వాటిని అమలు చేసేందుకు విశ్వ ప్రయత్నం చేస్తూ ప్రజలను, తన అభిమానులను రెచ్చగొడుతున్నారు. వీరా మనల్ని పరిపాలించేది' అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సినిమా ఈవెంట్‌లో అభిమానులను రెచ్చగొట్టేలా మాట్లాడటంపై శుక్రవారం రాత్రి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ''సోషల్ మీడియాలో వచ్చే కామెంట్లకు మీరు భయపడాల్సిన అవసరం లేదు.. దాడి చేయండి.. కొట్టండి.. మీకు నచ్చిన విధంగా దాడి చేయండి.. అది సివిలైజేషన్' అంటూ పవన్‌కళ్యాణ్ ప్రజలను, వారి పార్టీ సైనికులను రెచ్చగొట్టడం దారుణం. అదే రకమైన ప్రవర్తన జనసైనికులకూ వచ్చింది. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కారును అడ్డగించి రాళ్లు రువ్వి, పైకెక్కి వారు చేసిన విన్యాసాలను అందరూ చూశారు. తిరుపతిలో ఓ థియేటర్ అద్దాలు పగులగొట్టి.. టికెట్ లేకుండానే సినిమా చూశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తున్నారు. ఈ విధమైన ప్రవర్తనతో వీరు రాష్ట్రాన్ని ఎటు తీసుకెళుతున్నారని'' ప్రశ్నించారు.